క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: నాగులాపల్లి రైతు క్లబ్‌లో గురువారం సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన గౌతమీ నేత్రాలయం వైద్యుల పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా దయానందరాజు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో వివిధ పదవులకు నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా కె.దయానందరాజును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాలు, తీగల మార్పు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏపీఎస్‌డీ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పాత్రులు వీధి, చిన్న వీధి, బళ్లామార్కెట్, గాంధీబొమ్మ సెంటర్, తహసీల్దార్ ఆఫీస్, కొమరవీధి, బ్రౌన్‌పేట, పెద్ద బజారు, ఇస్మాయిల్ నగర్, పెన్షన్ లైన్, మెహర్ కాంప్లెక్స్, అయోధ్య రామపురం, పోస్టాఫీస్, అంబటివారి వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే ఏజీఎల్ ఫామ్, భీమేశ్వర స్వామి టెంపుల్, వాటర్ వర్క్స్, అయ్యప్ప స్వామి టెంపుల్ వీధి, ఇండస్ట్రీస్ స్టేట్, వీడియో ట్రైనింగ్ సెంటర్, బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, సీతారామ కాలనీ, సూది గుడి, యానాదుల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో పెద్ద ఏలేరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన చీమల ప్రసాద్ (23) హుస్సేన్‌పురం నుంచి పిఠాపురం వెళ్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొంది. దాంతో తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ప్రసాద్‌కు 20 రోజుల క్రితమే వివాహమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ ఎ.కృష్ణభగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా శాఖ భవనం ప్రారంభం

పెద్దాపురం: స్థానికంగా సుమారు రూ.1.70 కోట్లతో నిర్మించిన పెద్దాపురం సబ్ పోస్టాఫీస్‌ను గురువారం కేంద్ర మంత్రి చంద్రశేఖర్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాకినాడ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారులు హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనిల్ అంబేడ్కర్, ఏఎస్పీలు రామకృష్ణ, రమణమూర్తి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు బ్రహ్మనాయక్, లక్ష్మణరావు, సూర్యప్రకాశరావు, జగదీష్ పాల్గొన్నారు.

తుప్పటడుగులు

- మున్సిపల్ వాహనాలపై కానరాని శ్రద్ధ
- మూలకు చేరి పాడవుతున్న ఈ–ఆటోలు
- పారిశుధ్య నిర్వహణ గాలికి..



తుప్పపట్టి పాడవుతున్న పారిశుధ్య ట్రాక్టర్



మూలకు చేరిన ఈ - ఆటోలు



ఏడాదిన్నర నుంచి నిరుపయోగంగా ఉన్న సెప్టీ క్లీన్ ట్యాంకర్

సామర్లకోట: మన ఇంట్లో వస్తువు పనిచేయకుంటే వెంటనే మరమ్మతులు చేయిస్తాం.. దానిని అందుబాటులోకి తీసుకువస్తాం.. ఇక్కడైతే మనది కాదులే అనుకున్నారో ఏమో, మున్సిపాలిటీ వాహనాలను మూలకు చేర్చారు. చిన్నపాటి మరమ్మతులతో బాగయ్యే వాటినీ పక్కన పెట్టేశారు.. పారిశుధ్య నిర్వహణలో కీలకంగా ఉండాల్సిన వాహనాల పరిస్థితి ఇది. సామర్లకోట మున్సిపాలిటీలో చెత్త తరలించేందుకు ఉన్న వాహనాలు అధికారుల నిర్లక్ష్యానికి తుప్పుపట్టి పాడవుతున్నాయి. మున్సిపాలిటీ విస్తీర్ణం 14.7 చదరపు కిలోమీటర్లు కాగా, 60 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య నిర్వహణకు మొత్తం 149 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. వీరు రోజుకు 30 నుంచి 40 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. గత ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మున్సిపాలిటీకి తొమ్మిది ఈ– ఆటోలు అందించింది. ఇరుకు వీధుల్లోకి వెళ్లి పారిశుధ్య నిర్వహణ చేపట్టేలా వీటిని ఉపయోగించారు. అంతేకాకుండా పెట్రోల్ ఖర్చు లేకుండా, చార్జింగ్ పెట్టి వినియోగించేలా వీటిని రూపకల్పన చేశారు. దీనివల్ల ఖర్చు ఆదా అవుతుందని భావించారు. ప్రస్తుతం ఇందులో ఏడు ఈ - ఆటోలు మూలకు చేరాయి. కనీస మరమ్మతులు చేయకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. దీంతో చిన్న వీధుల్లో పారిశుధ్య నిర్వహణకు గ్రహణం పట్టింది.

చిన్న వీధులకు వెళ్లేలా..

ఈ – ఆటోలు సైరన్‌తో వెళ్తే ప్రజలు చెత్తను తీసుకువచ్చి ఇచ్చేవారు. మున్సిపాలిటీ ట్రాక్టర్లు చిన్న సందుల్లోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఈ - ఆటోలు ఉపయోగించేవారు. ఈ వాహనాలకు డ్రైవర్‌తో పాటు ఒక పారిశుధ్య సిబ్బందిని నియమించడం ద్వారా ఆయా వార్డులు శుభ్రంగా ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మినీ వాహనాలకు ప్రత్యేకంగా డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి ఉపయోగించాలనే నెపంతో వీటిని ఉపయోగించకుండా వదిలేయడంతో పాడైపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా ఏడాదిన్నర కిందట మున్సిపాలిటీకి వచ్చిన సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉంది. దీని పరికరాలు చోరీకి గురైనట్లు తెలిసింది.

వీటి పరిస్థితీ ఇంతే..

సతీష్‌చంద్ర జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో మున్సిపాలిటీకి వచ్చిన మినీ కర్షక్ ట్రాక్టర్‌ను ఉపయోగించకుండానే వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పారిశుధ్య ట్రాక్టర్ల కొనుగోలుకు నిధులు మంజూరు చేశారు. వాటితో ఆరు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ లోపం కారణంగా ఒక ట్రాక్టరు ఇనుప ముక్కగా మారిపోయింది. కొన్ని వాహనాలకు వెనుక డోర్లు లేక, వేసిన చెత్త రోడ్ల పొడవునా కిందపడి పోతుంది.

నిరుపయోగంగా వదిలేసి..



గతంలో అనేక పారిశుధ్య నిర్వహణ వాహనాలు తుప్పు పట్టి పాడైపోయాయి. మున్సిపాలిటీకి వచ్చిన మినీ పారిశుధ్య వాహనాలవి చిన్న మరమ్మతులు వచ్చాయని నిరుపయోగంగా వదిలేశారు. ప్రతి వాహనానికి గ్యారంటీ సమయం ఉంటుంది. ఆ సమయంలో మరమ్మతులు పూర్తి చేయించుకోవాలి. సుమారు పదేళ్ల క్రితం మున్సిపాలిటీకి వచ్చిన రోడ్ల శుభ్రత మెషీన్ ఇప్పటికీ నిరుపయోగంగా ఉంది. అదే పరిస్థితి సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌కు రాకుండా చూడాలి.

–నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

మరమ్మతులు చేయిస్తాం



ఈ – ఆటోలతో సిబ్బంది కొరత తగ్గుతుంది. మున్సిపాలిటీ వచ్చిన తొమ్మిది ఆటోలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం. సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌పై కౌన్సిల్ నిర్ణయం తీసుకుని వారి అభిప్రాయం ప్రకారం ఉపయోగించాలని భావించాం. ఈ వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించాం. అయితే కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదు. ఈ మేరకు మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహించి సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌ను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇస్తాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కొత్తపల్లి: స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం పిఠాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గురువారం మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

23న లక్ష పసుపు కొమ్ముల నోము

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23న లక్ష పసుపు కొమ్ముల నోము జరుగుతుందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం ఆయన ఆలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మాస శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలంకరిస్తామన్నారు. 23న ఉదయం 8 గంటలకు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయం నుంచి పంచారామ క్షేత్రంలోని అమ్మవారికి చీర, గాజులు, సారెలతో ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ముత్తయిదువులు తీసుకువచ్చే పసుపు కొమ్ములతో ఆలయంలో నోము జరుగుతుందన్నారు. ఈ నోముకు మహిళలు తమ స్తోమతను బట్టి పసుపు కొమ్ములను 22వ తేదీ మధ్యాహ్నం లోగా నూకాలమ్మ ఆలయంలో ధర్మకర్త వల్లూరి బుల్లియ్యకు అందజేయాలన్నారు. పంచారామ క్షేత్ర దీపారాధన సంఘ సభ్యులతో 22న సాయంత్రం నుంచి అమ్మవారికి శాకంబరిగా అలంకరణ ఉంటుందని చెప్పారు. శాకంబరి అలంకరణను తిలకించే భక్తులకు ఆలయం వద్ద ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు

- రైతన్నలను మోసగించిన ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రసంగిస్తూ రైతులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. రెండేళ్లుగా అన్నదాత సుఖీభవ సాయం అందించలేదన్నారు. చివరకు కేంద్రం ఇచ్చే వాటా కూడా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందని అన్నారు. తమ పార్టీ తరపున పోరాటం చేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కొన్న ధాన్యానికి ఇప్పటికీ చాలామంది రైతులకు డబ్బులు వేయకుండా ఇబ్బంది పెడుతుందన్నారు. పిఠాపురం పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నీతి నిజాయితీకి నిలబడి ఉన్నారన్నారు. మున్సిపాలిటీలో దళిత వాడల అభివృద్ధిని ప్రభుత్వం కక్ష కట్టి అడ్డుకుంటుందన్నారు. స్థానిక సంస్థల నిధులతో ఆమోదించిన పనులను ప్రభుత్వం అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. రాబోయే రోజుల్లో తీవ్ర ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని, నాయకులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా ఇప్పటికి మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను అమలు చేయలేదన్నారు. పోరాటం చేయగా తల్లికి వందనం మాత్రం ఇచ్చారని, అది కూడా చాలామంది అర్హులకు కోత పెట్టారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఇవ్వక పోవడంతో ఖరీఫ్ పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులందరికీ పథకాలు అందజేశారన్నారు. ముఖ్యంగా మహిళలను అన్ని విధాలా ఆదుకుని వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాంటి పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం నిలుదల చేసిందన్నారు. ప్రజల తరపున వైఎస్సార్ సీపీ గళం విప్పి పోరాటం చేస్తుందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎంత భయపెట్టినా, కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉంటూ ప్రజల తరపున పోరాటం చేయడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు వర్ధినీడి సుజాత, గండేపల్లి బాబి, తలిశెట్టి వెంకటేశ్వరరావు, ఉలవల భూషణం, పచ్చిమల్ల జ్యోతి, పెదపాటి రాజేష్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్తం దత్తుడు, వీఎస్ రెడ్డి, వజ్రపు వీరేష్, మొగలి అయ్యారావు, సోమరౌతు లలిత, సయ్యద్ మొహీద్దీన్, బత్తుల సాయిరాం, బొజ్జా రామయ్య, చెల్లూరి లోవరాజు, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బ్రేక్!

- సామర్లకోట కౌన్సిల్ సమావేశానికి తొలగని అడ్డంకులు
- వరుసగా మూడో నెలలోనూ అదే పరిస్థితి



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వరుసగా మూడో నెల కూడా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్‌లో 30 మంది సభ్యులున్నారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఏప్రిల్ 2న జిల్లా కలెక్టర్‌కు 22 మంది సభ్యులు సంతకాలతో వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఏప్రిల్ 3న అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు మే 15న అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారు. దీనికి ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబును నియమించారు. అదే రోజున చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అరుణ మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌డీఓ ఎదుట చేతులు ఎత్తే పద్ధతిలో 25 మంది సభ్యులు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ఆమోదం పొందడంతో మొదట వైస్‌చైర్మన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయాలని మెజార్టీ సభ్యులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే, అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందిన మర్నాడే తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు చైర్‌పర్సన్ అరుణ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మరోవైపు ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం కోర్టులో ఉన్న కారణంగా అవిశ్వాస తీర్మానాన్ని అధికారికంగా ప్రకటించడం లేదని నాడు ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు చెప్పారు. ఈ పరిస్థితుల్లో అధికారులు అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలో మే, జూన్ నెలల్లో కౌన్సిల్ సాధారణ సమావేశాలు జరగలేదు. కోర్టులో ఉన్న వివాదం ఈ నెల 28కి వాయిదా పడటంతో ఈ నెలలోనూ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం దాదాపు లేనట్లే. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకూ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేమని కౌన్సిల్ సభ్యులకు కమిషనర్ తెలిపారు.

అభివృద్ధికి ఆటంకం

ఆయా వార్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లు తమ ప్రాంతాల్లోని సమస్యలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తారు. వాటిని చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకురావడం ద్వారా, పరిష్కారం దిశగా అడుగులు వేస్తారు. దీనికి తగిన అజెండా తయారు చేస్తారు. దీనిని చైర్‌పర్సన్ ఆమోదించి, సంతకం చేసిన తరువాత కౌన్సిల్ సభ్యులకు అజెండా అందజేస్తారు. ప్రస్తుతం ఆవిధంగా అజెండా తయారు చేసే అవకాశం లేకపోవడంతో అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై కౌన్సిల్ ఆమోదం తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపాలిటీకి ఎంపీ నిధులతో పాటు, ప్రభుత్వం నుంచి కూడా నిధులు వచ్చాయి. వీటిని వివిధ అభివృద్ధి పనులకు కేటాయించి, కౌన్సిల్ తీర్మానాలకు లోబడి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, అసలు కౌన్సిల్ సమావేశమే జరిగే పరిస్థితి లేకపోవడంతో పట్టణ అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. కౌన్సిల్ సమావేశాలు జరిగిన సమయంలోనే ఆ నెలకు సంబంధించి సభ్యులకు గౌరవ వేతనాలు చెల్లిస్తారు. అలా సమావేశాలు జరగకపోవడంతో సభ్యులు వరుసగా మూడు నెలల పాటు గౌరవ వేతనాలు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడింది.

కళా రంగానికి అద్వితీయ సేవలు



మైలురాయి నాటికలో ఓ సన్నివేశం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ 25 ఏళ్లుగా రంగస్థల కళా రంగానికి అద్వితీయ సేవలు అందిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు గురువారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. కళా పరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త మట్టే సత్యప్రసాద్, మాజీ మంత్రి చిక్కల రామచంద్రరావు, క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ, కాకినాడ సీపోర్టు లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెల్ల మురళీధర్ పాల్గొని మాట్లాడారు. సీతారామరాజు కళా పరిషత్ సేవలను కొనియాడారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులకు పుట్టినిల్లుగా సంస్థ ఉందన్నారు. అనంతరం పలువురిని సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. తొలిరోజు నాటిక పోటీల్లో భాగంగా విజయవాడ వారి 27వ మైలురాయి నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యుడు మార్నీ జానకిరామచౌదరి పాల్గొన్నారు.

నవర సొసైటీ అధ్యక్షుడిగా తోట

సామర్లకోట: నవర సొసైటీ అధ్యక్షుడిగా గ్రామ రైతు తోట వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఆయన్ని పలువురు అభినందించారు. ఈ పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను వెంకటేశ్వరరావు సత్కరించారు.


కాకినాడకు జాతీయ స్థాయిలో 38వ ర్యాంక్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కాకినాడ 38 ర్యాంకుతో బెస్ట్‌గా నిలిచింది. ఏటా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా వివిధ ప్రమాణాల మేరకు వీటిని ప్రకటిస్తుంది. జనాభా ప్రాతిపదికన సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల కేటగిరీలో భాగంగా 3 లక్షల నుంచి 10 లక్షల లోపు కేటగిరీలో కాకినాడ నగర పాలక సంస్థ ఎంపికైంది. 2024–25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జాతీయ స్థాయిలో 38వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్‌తో మెరిసింది. గతంలో 2023–24 స్వచ్ఛ సర్వేక్షన్‌లో జాతీయస్థాయిలో 178వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్‌తో పోలిస్తే ఈ ఏడాది చాలా మెరుగైన ర్యాంకు సాధించింది. మున్సిపల్ కార్పొరేషన్ కనబరిచిన ప్రతిభకు కార్పొరేషన్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, పౌరులకు కలెక్టర్ సన్మోహన్ సగిలి అభినందనలు తెలిపారు. ఈ ర్యాంకులు ప్రజల సమష్టి కృషి ద్వారా వచ్చాయని కమిషనర్ భావన పేర్కొన్నారు.

క్యా బాతుహై



పిఠాపురం శివారు పంట భూమిలో బాతులు





బాతు గుడ్లను అమ్మకానికి సిద్ధం చేస్తున్న పెంపకందారుడు

- బాతు గుడ్లకు భలే గిరాకీ
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అమ్మకాలు

పిఠాపురం: ఆరోగ్య ప్రయోజనాలు ఉండే బాతు గుడ్లు అందుబాటులోకి వచ్చేశాయి.. వర్షాకాలం రావడంతో వివిధ జిల్లాల్లో ఉండే బాతులను పిఠాపురం నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు వలస తీసుకొచ్చారు. వివిధ వాహనాలపై వ్యాపారులు తీసుకువచ్చి ఇక్కడి పొలాల్లో మేపుతున్నారు. ఒక పక్క బాతులకు మంచి ఆహారం లభించడంతో పాటు, వాటి పెంట ద్వారా పొలాలకు మంచి బలవర్ధక ఎరువు లభ్యమవుతుంది. అందుకే తమ పొలాల్లో బాతులను మేపుకోవడానికి రైతులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు అక్కడక్కడ సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోకి నీరు పెట్టి దమ్ములు చేసే పనిలో ఉండగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బాతులు పొలాల్లో కనువిందు చేస్తున్నారు. ఇదే తరుణంలో బాతు గుడ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకూ బాతు గుడ్డు కావాలంటే ఎక్కడికో వెళ్లి తెచ్చుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం బాతు గుడ్లను వ్యాపారులు ఇక్కడే అమ్ముతున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

పిఠాపురం నియోజవర్గంలోని పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల పరిధిలో చాలాచోట్ల పొలాల్లో బాతులను పెంచుతున్నారు. నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి బాతులను పెంపకందారులు తీసుకొచ్చి గుడ్లను విక్రయిస్తున్నారు. వీటి కోసం జనం ఎగబడుతున్నారు. వరి పొలాల్లో మేపుతూ అదే ప్రాంతాల్లో గుడ్లను విక్రయిస్తున్నారు. ఒక్కో గుడ్డు రూ.6 నుంచి రూ.8 వరకూ అమ్ముతున్నారు. రోజుకు 1500 నుంచి 2 వేల గుడ్ల అమ్మకాలు జరుగుతున్నాయని పెంపకందారులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

బాతు గుడ్లలో వివిధ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బీ12, విటమిన్ డీ, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా–3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. వారానికి ఒక బాతు గుడ్డు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కాదంటున్నారు వైద్యులు.



గొల్లప్రోలు మండలంలో వర్షాలు లేక దుక్కి దున్ని ఖాళీగా ఉన్న మెట్ట భూమి



నీరు లేక ఎండుతున్న పత్తి చేను

వరుణుడి కరుణ కోసం..!

పిఠాపురం: సకాలంలో వర్షాలు లేక, కాలువలకు సాగు రాక, పలు వాణిజ్య పంటలు తడి లేక దెబ్బ తింటున్నాయి. కేవలం బోర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో అడపాదడపా తడిపెట్టి కొందరు రైతులు పంటలను కాపాడుకుంటుండగా, మిగిలిన చోట్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఎదురైంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో మిరప, ఆనబ, దొండ, వంగ, పత్తి, టమాటా వంటి పలు వాణిజ్య పంటల సాగును రైతులు చేపట్టారు. గతంలో పడిన వర్షాలకు భూములను దున్ని సాగుకు సిద్ధం చేసిన రైతులు ఆయా భూముల్లో నాట్లు వేశారు. అయితే సుమారు నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో వివిధ వాణిజ్య పంటలు వేసిన భూములు నెర్రలు తీస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడితే తప్ప వాణిజ్య పంటల సాగు సాధ్యం కాదని రైతులు వాపోతున్నారు. నీటి వసతి ఉన్నచోట గప్పు తవ్వే పనులు చేపట్టారు.